

## దుర్గమ్మ సన్నిధిలో నర్సాపూర్ జడ్జి

పాపన్నపేట, మే 1 : ఏడుపాయల వన దుర్గ భవానీ మాతను నర్సాపూర్ ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ హేమలత గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది.. ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమె వెంట వేద పండితులు శంకరశర్మ, పార్థివ శర్మతో పాటు ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, బత్తిని రాజు, వరుణాచారి, నర్సింహులు తదితరులున్నారు.

## సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

### ఎంఈఓ ప్రతాప్ రెడ్డి



పాపన్నపేట, మే 1: ఈనెల 2 నుంచి 16 వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లని మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన మా ట్లాడుతూ.. ఆరో తరగతి నుంచి 9వ తర గతి వరకు చదివే బాలబాలికలలు ఈ క్యాంపుకు అర్హులన్నారు. ఈ క్యాంపులో డ్రాయింగ్, క్రాఫ్ట్, కరాటే, కుట్లు, అల్ల కం, డ్యాన్స్, వివిధ రకాల ఆట పాటలు, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 15 రోజులపాటు కొనసాగే ఈ క్యాంప్‌ను పాపన్నపేట ఉన్నత పాఠ శా లలో నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపుకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్‌తోపాటు మంచినీటి సౌకర్యం కల్పించనునట్లు ఆయన వివరించారు. మిగతా వివరాలకు ఫోన్: 8500200859లో సంప్రదించాల్సిందిగా కోరారు.

# ఐక్య పోరాటాలతో కార్మికుల హక్కులు సాధ్యం

## మేడే ఉత్సవాల్లో యూనియన్ నాయకులు... కార్యాలయాల వద్ద కార్మిక జెండాల ఆవిష్కరణ

శివ్వంపేట, మే 1 : కార్మికుల ఐక్య పోరాటాలతో తమ హక్కులను సాధించుకోవచ్చని ఫ్లెమింగ్ పరిశ్రమ బీఆర్ఎస్ కార్మిక విభాగం యూనియన్ అధ్యక్షుడు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. మేడే సందర్భంగా మండలంలోని నవాబ్‌పేట ఫ్లెమింగ్ పరిశ్రమ ముందు కార్మికులతో కలసి ఆయన బీఆర్ఎస్ కార్మిక విభాగం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి కార్మికుల హక్కులు సాధించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పొట్టకొట్టొద్దని, కార్మికుల చట్టాలను పరిరక్షించి.. వారికి కనీస వేతనాలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

### రామాయంపేట పట్టణంలో..

రామాయంపేట : రామాయంపేట పట్టణంలో 139వ మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం పట్టణంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కార్యాలయం వద్ద, ఏఐటీయూసీ నాయకులు హమాలీ కార్మిక భవనం వద్ద, తాపీ మేస్త్రీలు సంఘం భవనం వద్ద వేర్వేరుగా కార్మిక జెండాలను ఎగురవేశారు. కార్మిక సంఘాల జిల్లా నాయకులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అయ్యవార్ల లక్ష్మణ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, మేస్త్రీల సంఘం మండల నాయకుడు మర్కు దత్తులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు పింఛన్, భీమా సౌకర్యంతో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా పరిశ్రమలను, ఆయా సంస్థలను ఒప్పించాలన్నారు. భవన నిర్మాణ రంగంలో పనులు చేస్తున్న కార్మికులకు ఒప్పందం మేరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులందరికీ పలు రంగాల్లో పనులు చేస్తున్నవారికి ఈపీఎఫ్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు.



మెదక్ మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

### కొడిపల్లి మండల కేంద్రంలో...

కొడిపల్లి : మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు కార్మిక జెండాను ఎగుర వేసి స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. భవన నిర్మాణ కార్మికులు నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినీరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చిలుముల దుర్గారెడ్డి, మాజీ సర్పంచ్ పురుషోత్తం, పోల నవీన్‌తో పాలు పలువురు నాయకులు, కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### వెల్దుర్తి, మాసాయిపేటలలో..

వెల్దుర్తి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలో అన్ని వర్గాల కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. వెల్దుర్తిలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అసంఘటితరంగ కార్మికులు కార్మికుల జెండాను ఎగురవేశారు. అనంతరం పట్టణంలోని పలు ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. కార్మికులకు పనికి తగిన వేతనాన్ని చెల్లించడంతోపాటు కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేసి అండగా నిలవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

### పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట : పెద్దశంకరంపేటలో గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పల్లెబోయిని రాములు, సీహెచ్ రాములు, భూమయ్య, వివేకానంద, తదితరులున్నారు

### కార్మిక చట్టాలను కాపాడుకుందాం..

నర్సాపూర్ : మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలను, హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు వెల్లడించారు. గురువారం మేడే సందర్భంగా నర్సాపూర్ పట్టణం , మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. ఇవాల్టీ కార్మికుల దుస్థితిని, పాలకవర్గాల నియంతపోకడలను గమనిస్తే మళ్లీ మేడే ఆవిర్భావంనాటి పోరాట పరిస్థితులు పునరావృతం అవుతాయన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నపూర్ణ, పుష్ప, రాములు, రిజ్వానా, ఆంజనేయులుగౌడ్, భీమేశ్, శుఖుర్, శ్రీనివాస్, సురేశ్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

### మెదక్ జిల్లా కేంద్రంలో..

మెదక్ మున్సిపాలిటీ : మేడేను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం, హెడ్ పోస్టాఫీస్ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సంతోష్, షౌకత్, మల్లేశం, సుధాకర్, యాదయ్య, దుర్గ, యూటీఫ్ జిల్లా కార్యదర్శి పద్మారావుతోపాటు ఆటో యూనియన్ కార్మికులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

### పాన్నపేట మండలంలో

పాపన్నపేట : పాన్నపేట మండలంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేశారు. సీఐటీయూ మండల నాయకులు అశోక్ మాట్లాడుతూ.. మన హక్కులు, చట్టాలను పరిష్కరించడానికి సామాజిక న్యాయం కోసం సీఐటీయూ పోరాటం కొన సాగిస్తుందన్నారు.

### చిన్నశంకరంపేట మండలంలో..

చిన్నశంకరంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం కార్మికులు మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. మండలంలోని ఖాజాపూర్ గ్రామశివారులో ఉన్న కావేరి స్టీల్ పరిశ్రమ కార్మికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.



బాచారంలో జెండాను ఎగుర వేస్తున్న కార్మికులు



చిన్నశంకరంపేట బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

## శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, మే 1 : శిక్షణ శిబిరాలను అండర్-14 క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గోమారం గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ప్రభుత్వం నిర్వహించే అండర్-14 వాలీబాల్ క్రీడాల శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరం మే 1 నుంచి 31 వరకు సీనియర్ క్రీడాకారులు జిన్నారం మహిపాల్‌రెడ్డి, రవీందచ్‌చారీల ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. ప్రతీ విద్యార్థి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని.. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, హనుమంత్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, కుంట లక్ష్మణ్, కుంట నగేశ్, వడ్ల భిక్షపతి, గడ్డం వెంకట్‌రెడ్డి, ముత్యంరెడ్డి, కాముని నవీన్, గంగిరెడ్డి నవీన్‌రెడ్డి, శైలేందర్‌గౌడ్ ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

శివ్వంపేట, మే 1 : శివ్వంపేట మండలం, నవాబ్‌పేట గ్రామానికి చెందిన సురకంటి విష్ణువర్ధన్‌రెడ్డికి మంజూరు అయిన రూ. 60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ సర్పంచ్ ఏనుగు అశోక్‌రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, శైలేందర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన సేవలతో ఆర్థికంగా ఎదగాలి

శివ్వంపేట, మే 1 : యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చిన్నగొట్టిముక్ల చౌరస్తా వద్ద బీఆర్ఎస్ యువనాయకుడు రాజేందర్‌నాయక్ ఏర్పాటు చేసిన టీ, టిఫిన్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్ ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య

రామాయంపేట, మే 1 : ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన బోధన ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు యాదగిరి, స్వామిలు పేర్కొన్నారు. గురువారం నూతన విద్యాసంవత్సరం అడ్మిషన్ల కోసం గ్రామాలబాట పట్టారు. కోనాపూర్ గ్రామానికి వెళ్లిన అధ్యాపకులు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇంటింటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించారు.ప్రభుత్వ కళాశాలల్లోనే కార్పొరేట్ విద్య లభిస్తుందని తెలిపారు. విద్యార్థులకు సబ్జెక్టులవారీగా ఇంగ్లీష్, తెలుగుబోధన ఉంటుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన బోధనతో బాటు ఫీజుల్లేకుండా మంచి విద్యను అందిస్తామన్నారు. అలాగే..ఉచితంగా పాఠ్యపుస్తకాలు, బస్‌పాస్ సౌకర్యం, ఉపకార వేతనాలు కూడా అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లతో బాటు ఒకేషనల్ కోర్సులు కూడా ఉంటాయన్నారు.

## ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను 24 గంటల్లో పరిష్కరించాలి

### తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి

తూప్రాన్, మే 1 : పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను 24 గంటల్లోగా పరిష్కరించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. గురువారం తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ వద్ద ఉన్న మొత్తం 173 పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రేపటిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ముసుగులో మధ్యవర్తులు, దళారులు మొదలయ్యారని, దళారుల జోక్యం అసలే ఉండకూడదని, ప్రజలెవరూ దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోకూడదన్నారు. డబ్బులు తీసుకున్నట్లు అవినీతి ఆరోపణలు వస్తే అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఇరిగేషన్ ఏఈ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు

రామాయంపేట, మే 1 : అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్ పేర్కొన్నారు. గురువారం రామాయంపేట మండలం, ఝాన్సీలింగాపూర్ గ్రామానికి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారినికలిసి ఇండ్లు నిర్మించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఇళ్లులేని నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేసిందన్నారు. రామాయంపేట మండల వ్యాప్తంగా 363 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని దామరచెర్వు గ్రామంలో 97 ఇండ్లు మంజూరు కాగా, అందులో కేవలం ఆరుగురు మాత్రమే బేస్మెంట్ వరకు కట్టారని, వారికి మొదటి బిల్లు లక్ష రూపాయల చొప్పున అందజేయడం జరిగిందన్నారు. మండలంలోని ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇండ్లు నిర్మించుకోవాలని అన్నారు.

## జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజు




మెదక్ మున్సిపాలిటీ, మే 1: జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, సంగమేశ్వర్‌లు, కోశాధికారిగా గరిపల్లి శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంజీర గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శు లు శ్రీనివాస్, శ్రీనివాస్, ఏఐఓసీడీ సభ్యులు మృత్యుంజయరెడ్డి, వెంకట్, శ్రీనివాస్, కృష్ణకుమార్, తెలంగాణ ఫార్మసీ కౌన్సిలర్ మెంబర్ సుధాకర్‌ల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులను రాష్ట్ర నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. త్వరలో పూర్తి స్థాయి జిల్లా కమిటీని ప్రకటిస్తామని నూతన అధ్యక్షకార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కెమిస్ట్‌లు పాల్గొన్నారు.

## వైభవంగా పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

*నిజాంపేట, మే 1 :* కల్వకుంటలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ ఆరవ వార్షికోత్సవాలు ముదిరాజ్ సంఘం సభ్యుల అధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో పెద్దమ్మ పెద్దరాజుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, గంగాదేవికి తెప్పోత్సవం, మహా గణపతిపూజ, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ చింతల స్వామి దంపతులు, రాధాకిషన్ దంపతులు, భక్తులు, తదితరులు ఉన్నారు.

## రామాయంపేటలో యోగా శిక్షణ శిబిరం

రామాయంపేట, మే 1: రామాయంపేట పట్టణంలోని ఉచితంగా యోగా శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగా గురువు, యువజ్యోతిక్లబ్ చైర్మన్ బొంతల సత్యనారాయణ తెలిపారు. గురువారం తెల్లవారు జామున ప్రారంభించిన యోగా శిబిరానికి పలువురు హాజరై.. యోగా ఆసనాలు వేశారు. వేసవి కాలం దృష్ట్యా విద్యార్థులకు సెలవులను దృష్టిలో పెట్టుకుని రామాయంపేట ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో ప్రతిరోజు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి 7వరకు, సాయంత్రం 6 నుంచి 7గంటల వరకు యోగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## నర్సాపూర్ మండల కేంద్రంలో సమ్మర్ క్యాంప్

నర్సాపూర్,మే1 : నర్సాపూర్ మండల కేంద్రంలో ఈ నెల 2 నుండి 6 , 9వ తరగతి విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి తారాసింగ్ వెల్లడించారు. గురువారం మండల వనరుల కేంద్రంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమ్మర్ క్యాంప్ తరగతులు మే 2 నుండి మే 16 వరకు 15 రోజుల పాటు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ క్యాంప్‌లో డ్రాయింగ్, ఆర్ట్, యోగ, సాంగ్స్‌కు సంబంధించిన తరగతులు వాలంటీర్ల ద్వారా చెప్పడం జరుగుతుందన్నారు. నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుండి 11 గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు రాధాగోపాల్, భైరవరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగురుపీఠానికి రూ. 10వేల విరాళం

శివ్వంపేట, మే 1 : శివ్వంపేట మండలం గూడురు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీగురుపీఠానికి తాజా మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మిశ్రీనివాస్‌గౌడ్ కూతురు విశ్వజ తన మొదటినెల సంపాదనలోని రూ.10వేల విరాళాన్ని శ్రీగురుపీఠం ట్రస్టు చైర్మన్ శివకుమార్‌గౌడ్‌కు అందజేశారు. చిన్నవయస్సులోనే సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.

## హెల్మెట్ ధరించకపోతే చర్యలు తప్పవు

రామాయంపేట,మే 1 : ద్విచక్ర వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్‌లు ధరించాలని రామాయంపేట ఎస్సై బాలరాజు పే ర్కొన్నారు. గురువారం రామాయంపేట డి.ధర్మారం చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో భాగంగా హెల్మెట్‌లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అ నంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. కొంత మం ది వాహనదారులు హెల్మెట్ ఉన్నా ఇంటి వద్ద పెట్టివచ్చామంటూ బుకాయింపులు చేయ డం మానుకోవాలన్నారు. వాహనాలకు సం బంధించిన పేపర్లు అన్ని ఉండాలని, లేకుంటే కేసులు నమోదు చేయడమే కాకుండా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆటోలు నడిపేవారు సామ ర్థ్యానికి మించి ప్రయాణికులను చేరవేస్తే కఠి న చర్యలు తప్పవన్నారు.

## నిజాంపేట తహసీల్దార్‌గా శ్రీనివాస్

నిజాంపేట, మే1 : నిజాంపేట మండల నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ గురువా రం పదవీ బా ధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్ సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) హైదరాబాద్ కార్యాలయంలో పనిచేసి నిజాంపేటకు బదిలీపై వచ్చారు.

## ఎట్టకేలకు ప్రారంభమైన బీటీ రోడ్డు పనులు

నిజాంపేట, మే 1 : నిజాంపేట ప్రధాన రహదారి నుంచి నస్కల్ వయా రాంపూర్, నందగోకుల్, చల్మెడ గ్రామాల వరకు రూ.12.40 కోట్ల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభమైనాయి. బీటీ రోడ్డు నిర్మాణం కోసం నస్కల్ గ్రామస్తులు, ఇతర పార్టీల నాయకులు చేసిన రిలే నిరాహార దీక్షల ఫలితం దక్కింది. సదరు కాంట్రాక్టర్ మొదటగా నస్కల్ గ్రామం వైపు తారు పనులను ప్రారంభించారు.

## 10 ఫలితాల్లో సత్తాచాటిన 'సర్కార్' విద్యార్థులకు సన్మానం

చిన్నశంకరంపేట, మే 1 : అన్ని స్థానాల కంటే గురుస్థానం గొప్పదని, అలాంటప్పుడు ప్రభుత్వ పాఠశాలలోని గురువులు, విద్యాబోధనను గ్రహించి బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని తహసీల్దార్ అబ్దుల్ మన్నన్ అన్నారు. చిన్నశంకరంపేట మండలం, మడూర్ జడ్పీ పాఠశాలలో వెంకట్‌రావ్‌పల్లి గ్రామానికి చెందిన కాశబోయిన కృష్ణ, భాగ్యల కూతురు రాజేశ్వరి పదోతరగతి ఫలితాల్లో 570 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడం ఎంతో అభినందనీయమని, రాజేశ్వరి మాదిరిగా పాఠశాలలో విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి వెళ్ళాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అబ్దుల్ మన్నన్, ఎస్సై నారాయణగౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీపతిలు టాపర్ రాజేశ్వరిని శాలువాతో సన్మానించి మెమోంటోను అందించారు. అలాగే చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాలలో 500మార్కులతో కటూరి సౌమ్య ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో పుల్ల సుమలత 492 మార్కులతో తృతీయ స్థానంలో నిలవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీప్లానాయక్ జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రెపోచయ్య, బాలరాజు, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మండల టాపర్ రాజేశ్వరిని సన్మానిస్తున్న తహసీల్దార్ మన్నన్, ఎస్సై నారాయణ

## చట్టాల గురించి తెలుసుకోవాలి

మెదక్ అర్బన్, మే1: చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి కం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యాదర్శి శుభవల్లి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెదక్ బస్ డిపోలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, 18సంవత్సరలలోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదని సూచించారు. ఆర్ఎం , డిపో మేనేజర్ పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

చిన్నశంకరంపేట,మే1 : చిన్నశంకరంపేట మండలం, జంగరాయి గ్రామానికి చెందిన గడ్డం చంటూ అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న లీలాగ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ గురువారం జంగరాయికి విచ్చేసి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ సర్పంచ్ జ్యోతి , డైరెక్టర్ ప్రభాకర్, అశోక్‌నాయక్, లీలాగ్రూప్ సభ్యులు సురేశ్ నాయక్, భాను, కుమార్, మహిపాల్, గోపాల్, సురేశ్,సుధాకర్ పాల్గొన్నారు.

## తూకంలో తేడాలు రాకుండా జాగ్రత్త పడాలి

నర్సాపూర్,మే1 : ధాన్యం తూకంలో ఎటువంటి తేడాలు రాకుండా సర్లైన విధంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కాగజ్‌మద్దూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తేమ శాతం రాగానే కాంటాలు త్వరగా పూర్తిచేసి వేగవంతంగా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఎక్కువ రోజుల వరకు కేంద్రాల్లోనే నిల్వ చేయకూడదని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాల్లో గన్నీ సంచులు, తాడిపత్రీలు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీవో మహిపాల్‌రెడ్డిపాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, మే 1 : వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చీలపల్లి, కొత్తపేట, గొట్టిముక్కుల గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు వరి ధాన్యంను దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గోపాల్, నాయకులు రాయిని మధు, నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, అనంత్‌రావు, తదితరులున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం..

వెల్దుర్తి, మే 1 : మండలంలోని ధర్మారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెల్దుర్తి పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (55) ధర్మారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మృతిచెంది ఉన్నాడు. గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని పరిశీలించగా.. కుడిచేతిపై ఇటికె అంజయ్య అనే పేరుతో ఉన్న పచ్చుబొట్టును గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. వీఆర్ఏ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కాపర్‌వైర్ చోరీ

చిన్నశంకరంపేట,మే 1: చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామశివారులోని వ్యవసాయ పంట పొలాల వద్ద గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్, ఆయిల్‌ను చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. పంట పొలాల వద్దకు వెళ్ళిన రైతులు విషయం గమనించి విద్యుత్ లైన్‌మెన్ భిక్షపతి దృష్టికి తీసుకుపోగా అతను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెదక్ మున్సిపాలిటీ, మే 1 : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల నేపథ్యంలో హౌసింగ్ బోర్డులోని 11 కేవీ ఫీడర్ పరిధిలోని హౌసింగ్‌బోర్డుతో పాటు అవుసులపల్లి, ఔరంగాబాద్‌లలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, పట్టణ ఏఈ నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు .



*జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్, వినాయక గార్డెన్‌లలో గురువారం జరిగిన వివాహాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, సలాం, సాధిక్, బీఆర్ఎస్ నాయకులు పట్లోరి రాజు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, కిరణ్, రంజిత్ నాయక్, భువన్, లడ్డునాయక్ తదితరులు ఉన్నారు. – మెదక్ మున్సిపాలిటీ, మే 1*

## నూతన వధూవరులకు ఆశీర్వాదం..

కొల్చారం : వెల్దుర్థి మండలం, మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ రంగి కృష్ణ ఆహ్వానం మేరకు కొల్చారం బాబా ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన పెళ్లి వేడుకలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముత్యంగారి సంతోశ్ కుమార్, కరెంట్ రాజాగౌడ్, గ్యాస్ కృష్ణ, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట : రాంపూర్ గ్రామానికి చెందిన యాడారం లత, లింగాగౌడ్ దంపతుల కూతురు శ్వేత వివాహం స్థానిక రేణుక ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆశీర్వదించినవారిలో బీఆర్ఎస్ మండల,గ్రామ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, యాదగిరి, మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు గౌస్, నాయకులు దుబ్బరాజుగౌడ్, విజయ్, నగేశ్‌యాదవ్, వెంకటస్వామిగౌడ్, నగేశ్, జైపాల్‌రెడ్డి, రాజు, నర్సింహులు ఉన్నారు.